

వివరాలు లోపలి పేజీల్లో

**ఫీజు బకాయిల విడుదల చేయకపోతే మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తాం**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 17 అక్టోబరు , 2025 | పేజీలు : 06

# కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగిస్తే సహించం

## ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ పార్టీకి ఎవరైనా నష్టం కలిగిస్తే సహించేది లేదని, తాను ఎవరి దగ్గర రూపాయి కూడా తీసుకోలేదని రుజువు చేస్తే ఎలాంటి శిక్ష కైనా సిద్ధమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం సంఘటన్ సృజన్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ఏఐసీసీ ఎన్నికల పరిశీలకులు బిశ్వరాజ్ మహంతితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా బాధ్యతలను చేపట్టానని, వారసత్వ రాజకీయంతో తాను రాలేదని, సామాజిక సేవతోనే ప్రజలకు మంచి చేయాలనే ఉద్ధేశ్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఎవరి వద్దనైనా ఒక్క పైసా తీసుకోలేదని ఎవరైనా తాను అవినీతికి పాల్పడినట్లు రుజువు చేస్తే దేనికైనా సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఓడితే అందరం మునుగుతామని అది అర్థం చేసుకోని వ్యక్తిగత విష ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. తాను, తన కుటుంబం జీవితంలో ఎన్నో కష్టాలు పడ్డామని ఇప్పుడు 162 లారీల యజమానిగా ఎదిగానని, సామాజిక సేవకుడిగా ఉంటూ ప్రజలకు మంచి చేయాలనే ఉద్ధేశ్యంతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, ఇందు కోసం తాను 92 లారీలను అమ్ముకున్నానని తెలిపారు. సోషల్ మీడియా వేదిక ద్వారా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ ఇతర పార్టీలకు కొమ్ముకాస్తున్న కొంతమంది విమర్శించడం వల్ల తనకే కాకుండా పార్టీకి సైతం నష్టం వాటిల్లుతుందని తెలిపారు. తన కుమారుడి వివాహ రిసెప్షన్‌ను సైతం రద్దు చేసుకోని దానికయ్యే ఖర్చును ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్ధేశ్యంతో రూ.2కోట్లను సీఎం రేవంత్‌రెడ్డికి అందించిన సంగతిని గుర్తు చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లే మనస్తత్వం తనది కాదని, తన తుది శ్వాస వరకు కాంగ్రెస్ జెండాను ఎత్తుకోని తన ఎజెండా మార్చుకోని ముందుకు పోతానన్నారు. నిజమైన కార్యకర్తలకు, నమ్ముకున్న నాయకులకు అన్యాయం జరగనివ్వకుండా చూస్తానని హామి ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, సంపద కోసం రాజకీయం చేయకుండా, ప్రజా శ్రేయస్సు కోసం రాజకీయం చేస్తానని తెలిపారు. గత రెండేళ్లుగా కొంతమంది తనను ఇబ్బందులకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్నారని ఇది మంచి పద్దతి కాదన్నారు. బీఎల్ఆర్‌కు ఏం తెలియదు అని చాలా మంది అనుకుంటున్నారని, ఈ రెండేండ్లలో అన్ని నేర్చుకున్నానని, ఎవరు గోతులు తీస్తున్నారో, ఎవరు వెన్ను పోటు పొడవడానికి సిద్ధంగా ఉన్నారో అన్ని తనకు తెలుసని తెలిపారు. ఈ పార్టీలో ఉంటూ మరో పార్టీకి కొమ్ము కాస్తున్న వెన్నుపోటు దారుల నుంచి నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



## అధికారులు విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదు

### కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్

**ప్రజాపక్షం/కోదాడ:** అధికారులు సమయాపాలన పాటించకుండా అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ హెచ్చరించారు. గురువారం మునగాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయాన్ని ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సమయాపాలన పాటించకుండా గైహజరైన ఆరుగురు అధికారులు డి.టి సత్యనారాయణ, ఎం.పీ.ఎస్.ఓ సంపత్, జూనియర్ అసిస్టెంట్స్ దీప్తి, సునిల్‌గవాస్కర్, రికార్డు అసిస్టెంట్స్ పురుషోత్తం, ప్రశాంత్‌ల ఉదయం సమయం 10.30నిమిషాలు దాటుతున్న అధికారులు కార్యలయంలో రిపోర్టు చేయకపోవడంతో సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. అనంతరం కార్యలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించగా క్యాలయంలో మొత్తం 18 మంది ఉద్యోగులకు గాను నాలుగురు ఉప నియమకంపై ఇతర కార్యలయాలలో విధులు నిర్వహిస్తుండగా, ఒకరు సర్వే విధులకు వెళ్లారు. ఇద్దరు ఉద్యోగులు ఆకస్మిక సెలవుపై ఉన్నారు. మిగిలిన ఉద్యోగులు గైర్హాజర్‌పై తహసీల్దార్ సరితను వివరణ కోరినారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వీరి వెంట రెవిన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## సమయ పాలన పాటించాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం):** వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యాధికారులు,సిబ్బంది అందుబాటు ఉండి మెరుగైన వైద్యం అందించాలని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం శాలిగౌరారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ చేశారు.అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించి ఎంతమంది సిబ్బంది హాజరయ్యారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.డాక్టర్స్ సమయ పాలన పాటించాలని ఆదేశాలు జారీ చేశారు.సమయ పాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.అత్యవసర విభాగం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని,శానిటేషన్ సిబ్బంది హాస్పిటల్ ని శుభ్రంగా ఉంచుకోవాలని,ఓపి ని తనిఖీ చేశారు.రికార్డులను,ఫార్మసీ,లేబర్ రూములు పరిశీలించారు.అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు శోకకుండా అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హాస్పిటల్ లోని బిల్డింగ్ పై కప్పు పెచ్చులు ఊడి ఉన్నాయని వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని,కొత్త బిల్డింగ్ కి సంబందించిన ప్రాసెస్ ను సంబంధించి డిప్యూటీ డి ఎమ్ ఎచ్ వో ని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ యానాల అశోక్ రెడ్డి,తహసీల్దార్ బి.వరప్రసాద్,డాక్టర్ వాసవి,యుడిసి జగన్నాథ్ రెడ్డి,పిహెచ్ సి సిబ్బంది పాల్గొన్నారు.



# ఆస్తి కోసం కన్నతల్లికి 3 రోజులుగా అంత్యక్రియలు చేయని కూతుర్లు...

## పోలీసుల రంగ ప్రవేశంతో ఎట్టకేలకు అంత్యక్రియలు...

**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** నవమాసాలు మోసీ పెంచి పెద్దచేసిన కన్నతల్లి కడతేరగా కుమారులు లేకపోవడంతో ఇద్దరి కూతుర్ల మధ్య ఆస్థి పంపకాలలో విభేదాలు తలెత్తడంతో మూడు రోజులుగా అంత్యక్రియలకు కూడా జరగలేదు. ఈ అత్యంత దయనీయమైన సంఘటన సూర్యాపేట నియోజక వర్గంలోని ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గురువారం పోలీసుల రంగ ప్రవేశంతో ఎట్టకేలకు అంత్యక్రియలు నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆత్మకూర్ మండల కేంద్రానికి చెందిన పొద్దిల్ల నరసమ్మ (80) ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త వారి చిన్నతనంలోనే మరణించాడు. ఆనాటి నుండి ఊరురా తిరుగుతూ ఇంటింటికి వెళ్ళి పూసలు, బొట్టు బిళ్ళలు అమ్ముతూ జీవనం సాగిస్తూ వారిని పెంచి పెద్దచేసి పెండ్లిలు చేసింది. పెద్ద కుమార్తె వెంకటమ్మకు వివాహం చేసి అల్లుడిని ఇల్లరికంగా తీసుకవచ్చింది. చిన్న కుమార్తె కళమ్మను సూర్యాపేటకు చెందిన బండి లక్ష్మయ్యకు ఇచ్చి పెండ్లి చేసింది. ఆమెకు 3 ఎకరాల భూమి, కొంత బంగారం, మరికొంత నగదును కట్నకానుకల కింద ఇచ్చింది. పెద్దల సమక్షంలో ఆస్తులు పంచుకున్న కూతుర్లు వృద్ధాప్యంతో బాధపడుతున్న తల్లి నరసమ్మను చాదే విషయంలో కూడా ఒక నిర్ణయానికి వచ్చారు. ఇటీవల అనారోగ్యంతో ఉన్న తల్లి నరసమ్మ తన చిన్న కూతురు కమళమ్మ ఇంటికి వెళ్ళింది. తన వద్ద ఉన్న 6 తులాల బంగారం, కొన్ని వెండి వస్తువులను వెంట తీసుకవెళ్ళింది. మంగళవారం సాయంత్రం నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. పెద్ద కూతురు వెంకటమ్మ ఇంటి వద్ద అంత్యక్రియలు నిర్వహించేందుకు సూర్యాపేట నుండి ఆత్మకూర్(ఎస్)కు తీసుకెళ్ళారు. ఆమె వద్ద ఉన్న బంగారం, వెండి, నగదు ఏమయ్యాయని తన చెల్లెను వెంకటమ్మ నిలదీసింది. అవి ఇచ్చేంత వరకు అంత్యక్రియలు చేసేది లేదని పట్టుబట్టింది. నరసమ్మ మృతదేహాన్ని సందర్శించడానికి వచ్చిన బంధువులు ఇద్దరి మధ్య సయోధ్య కుదుర్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. మూడు రోజులుగా తల్లి మృతదేహానికి అంత్యక్రియలు చేయలేదు. గ్రామ పెద్దలు చెప్పినా వారు వినకపోవడంతో స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్‌కు గురువారం సమాచారం అందింది. దీంతో ఆయన రంగంలోకి దిగి చిన్న కూతురు కమలమ్మకు ఫోన్ చేసి అంత్యక్రియలకు హాజరు కావాలని చెప్పడం, ఆత్మకూర్(ఎస్)లో ఉన్న పెద్ద కూతురు వెంకటమ్మకు సర్ధిచెప్పడంతో ఎట్టకేలకు తల్లికి అంత్యక్రియలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో మనుషుల మధ్య బంధాలు, బంధుత్వాల కంటే ఆస్తులు, అంతస్తులకే ప్రాధాన్యత ఇస్తారేమోనని దీనిని బట్టి స్పష్టమవుతుంది. ఇదే విషయంపై ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతుంది.





## 108లో ప్రసవం

**ప్రజాపక్షం/చండూరుః** చండూరు మున్సిపాలిటీలోని అంగడిపేటకు చెందిన గర్భిణీ రాజేశ్వరి కి పురిటి నొప్పులు రావడంతో గురువారం 108 లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పురిటి నొప్పులతో బాధపడుతూ పాపమెడకు బొడ్డుతో చుట్టుకుని ఇబ్బంది పడుతున్న రాజేశ్వరిని చాకచక్యంగా కానుపు చేయడంతో మార్గం మద్యలో 108లోనే ఆడ బిడ్డకు జన్మనిచ్చారు. అనంతరం 108 సిబ్బంది తల్లిబిడ్డను క్షేమంగా చండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 108 ఇఎంటి గండూరి యాదగిరి, పైలెట్ గాలిబ్ , అంబులెన్స్ సిబ్బందికి రాజేశ్వరి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బంద్‌కు సహకరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న రాష్ట్ర బంద్‌కు సహకరించాలని గురువారం బీసీ జేఏసీ డివిజన్ అధ్యక్షుడు గుండెబోయిన నాగేశ్వరయాదవ్, చేగొండి మురళీయాదవ్ లు సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎండి.సయీద్‌ను కలిసి విజప్తి చేశారు. ఈ సందర్భంగా సయీద్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు జరిపినప్పుడే వారి అభివృద్ధి జరుగుతుందని, అందుకు కేంద్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి రిజర్వేషన్లను అమలుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఉన్నారు.

## సమగ్ర శాసన చట్టం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సంపదను సృష్టిస్తూ దేశానికి అన్నం పెట్టే వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర శాసన చట్టం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్ భవన్‌లో జరిగిన వ్యకాసం జిల్లా కమిటి సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. వ్యకాసం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మట్టిపెల్లి సైదులు, పోసనబోయిన హుస్సేన్, సోమపంగ జానయ్య, నల్లమేకల అంజయ్య, పటాన్ మహబూబ్ అలీ, జంపాల స్వరాజ్యం, లక్ష్మి పాల్గొన్నారు.



## ప్రజలకు సేవలు అందించడంలో పోలీసులు ముందుండాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రజలకు సేవలు అందించడంలో పోలీసులు ముందు ఉండాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ సూచించారు. గురువారం అర్వపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను, కేసుల వివరాలను ఎస్ఐని అడికి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని స్థానిక కూడలి వద్ద గ్రామాల్లోని సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సిసి కెమెరాలతో గ్రామాల్లో పూర్తిగా సమస్యను పరిష్కరించవచ్చని అన్నారు. మండలంలో అక్రమంగా ఇసుక రవాణా నిర్వహిస్తున్నారని, అక్రమ రవాణా ఇసుకను రవాణా జరగకుండా పూర్తిగా నివారించాలన్నారు. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు అతివేగంతో ప్రయాణించే వారిపై కేసులు నమోదు చేసి నియంత్రించాలన్నారు. అతివేగం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని వాటిని నియంత్రణ చేయాలని సూచించారు. బాధితులకు సరైన న్యాయం



జరిగినప్పుడే డైరెక్ట్‌గా ఎస్‌పి కార్యాలయానికి రాకుండా ఉంటారన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఎస్ఐ ఈట సైదులు, ఏఎస్ఐ రామకోటి, హెడ్ కానిస్టేబుల్ సుధీర్, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు ఉన్నారు.

## అకస్మాత్తు గుండెపోటు రక్షణకు సిపిఆర్ గోల్డెన్ మినిట్



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తులకు సిపిఆర్ చేయటం బంగారు క్షణాలని ప్రాణాలను రక్షించే అత్యవసర తిరిగి ప్రాణాలను రక్షించే వైద్య ప్రక్రియని చౌటుప్పల్ డివిజన్ సిపిఆర్ ట్రైనింగ్ డా.కాటమరాజు తెలిపారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో పోచంపల్లి ఎంపీడీవో ఆఫీసు నందు సిపిఆర్ ట్రైనింగ్‌ను గురువారం నిర్వహించారు. పోచంపల్లి మున్సిపల్, ఎంపీడీవో ఆఫీసు, పంచాయతీ సెక్రెటరీ, తహసిల్దార్ ఆఫీస్, పోలీస్ స్టేషన్ సిబ్బంది, మున్సిపల్ పరిధిలోని ఆశాలు అంగన్వాడీలకు సిపిఆర్ ఒక్క ఆవశ్యకత అవసరం అందరికీ అవగాహన కల్పించడంతోపాటు అత్యవసర సమయాల్లో ఎలా వైద్యం అందించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు సాంకేతిక అధికారిగా అనిల్ కుమార్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** వరంగల్ జిల్లా జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగుతున్న ఇండియన్ ఓపెన్ అండర్ 23 అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌కు భువనగిరి పట్టణానికి చెందిన అంత ర్జాతీయ మాస్టర్ క్రీడాకారుడు అంబోజు అనిల్ కుమార్ జాతీయస్థాయి సాంకేతిక అధికారిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన శాంతి స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ క్రీడాకారులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలకు సాంకేతిక అధికారిగా పనిచేయడం జరిగిందని తనపై నమ్మకం ఉంచి సాంకేతిక అధికారుల కు బాధ్యతలు అప్పజెప్పినా తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, టెక్నికల్ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు సాంకేతిక అధికారిగా ఎన్నిక కావడం పట్ల శాంతి స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ క్రీడాకారులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## డిప్యుటేషన్ రద్దు చేయాలని ఎంఇఒకు వినతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామం ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయుల డిప్యుటేషన్ రద్దు చేయాలని కోరుతూ గురువారం ఆ గ్రామ యువకులు ఎంఈఓ ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఐదుగురు అందులో ఒకరు మెడికల్ లీవ్ పై ఉన్నారు. మిగిలిన నలుగురు ఉపాధ్యాయులలో ఇటీవలే డివో ఆదేశాల మేరకు డిప్యూటేషన్ పై ఇద్దరు టీచర్స్ వేరే పాఠశాలలోకి వెళ్లాలని ఆర్డర్స్ ఇచ్చారు. కేవలం ఇద్దరు ఉపాధ్యాయులతో పాఠశాలను ఎలా నడిపిస్తారని ఆవేదన వ్యక్తం చేస్తూ వెంటనే వారి డిప్యూటేషన్ రద్దు చేయాలని ఎంఈఓను కోరారు. సిలువేరు శేఖర్, కంటే లింగస్వామి, మాజీ సర్పంచి కంటే రాములు, వెంకటేష్ వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో ఉన్నారు.



## రామకృష్ణ సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ పార్టీకి మాజీ మున్సిపల్ కమీషనర్ గంధం రామకృష్ణ చేసిన సేవలు మరువలేనివని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ఏఐసీసీ పరిశీలకులు బి.సర్వంజన్ మహంతి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు అన్నారు. గురువారం పట్టణంలోని ఏఆర్‌సీ గార్డెన్‌లో నిర్వహించిన రామకృష్ణ సంతాప సభలో వారు పాల్గొని రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి రామకృష్ణ నిరంతరం పరితపించేవారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యుత్ షాక్‌తో మహిళ మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన శిరిషాల నరసమ్మ(58) కూలీ పని చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తుంది. బుధవారం కూలీ పనికి వెళ్లి ఆమె సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చింది. రాత్రి 9గంటల సమయంలో ఉతికిన బట్టలు ఇంటి ఆవరణలో ఉన్న దండెంపై ఆరవేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. గురువారం ఉదయం గ్రామంలోని తోటి మహిళా కూలీలు నరసమ్మను కూలీ పనికి తీసుకెళ్లేందుకు ఇంటి వద్దకు వచ్చి పిలవగా ఎంతకు పలకకపోవడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా దండెం వద్ద విగతజీవిగా పడి ఉంది. దీంతో ఆమెను చూసిన కూలీలు స్థానికులకు సమాచారం అందించారు. కాగా నరసమ్మ భర్త ఇటీవల మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె ప్రస్తుతం ఒంటరిగానే ఉంటుంది. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

## మరో బిసి ఉద్యమానికి ప్రజలు సిద్ధం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రాష్ట్రంలో మరో బిసి ఉద్యమానికి ప్రజలు సిద్ధం కావల్సిన సమయం ఆసన్నమైందని బిసి జెఏసి జిల్లా కన్వీనర్ భద్రబోయిన సైదులు తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బిసి జెఏసి కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి ఐక్య కార్యాచరణ కమిటి బిసి బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, వ్యాపారస్తులు, కార్మిక లోకం, సబ్బండ వర్గాల ప్రజలందరూ స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించి మరొక్కసారి బిసిల ఐక్యత చాటాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల కోసం బంద్‌కు బిసి జెఏసి సూర్యాపేట పక్షాన పూర్తి మద్ధతు ప్రకటిస్తూ ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బైరోజు మదనాచారి, ముత్యం, నాగేంద్రబాబు, సాయి, శివ, మనోజ్, దీక్షత్ పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యారంగంలో, ఉద్యోగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని తెలంగాణ యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నారబోయిన కిరణ్ కుమార్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తెలంగాణ జన సమితి నియోజక వర్గ బృందంతో కలిసి ఆయన స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్, వివిధ సంఘాల నాయకులు భాషబోయిన వేణురాజ్, నాగు నాయక్, సుమన్ నాయక్, పిట్టల మురళీ, భరత్ పాల్గొన్నారు.

## మండల ఎపిఒగా యాదమ్మ



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల ఏపిఓగా యాదమ్మ బాధ్యతలను ఎంపిడిఓ చేతుల మీదుగా స్వీకరించారు. టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆమెకు బాధ్యతను అప్పగించారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ శిల్పక, టెక్నికల్ అసిస్టెంట్ నాగమణి, సిఓఏ సుధీర్ రెడ్డిలు ఉన్నారు.

# ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్రజాపక్షం/చందంపేట; నల్గొండ జిల్లా చందంపేట మండలం నేరేడుగొమ్ము మండలం కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే లక్ష్యంతోనే ఆదర్శ పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌కు సహకరించిన శ్రీను నాయక్‌ను ఎంఎల్‌ఏ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్యనాయకులు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఈసీ మిరాజ్ ఉద్దీన్ మరణం తీరని లోటు

ప్రజాపక్షం/వేములపల్లి: ఉపాధి హామీ ఈసీ,ఇన్చార్జి ఎపిఓ మహమ్మద్ మిరాజ్ ఉద్దీన్ అకాల మరణం తీరని లోటు అని శెట్టిపాలెం పంచాయతీ కార్యదర్శి నవీన్ రెడ్డి అన్నారు గురువారం గ్రామపంచాయతీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి నవీన్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ లు మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో ఫీల్డ్ అసిస్టెంట్లకు కన్నతండ్రి లాగా అండగా ఉంటూ ఉపాధి హామీ సిబ్బందికి,కూలీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండాలని కార్యాలయంలో గాని ఉపాధి హామీ పని ప్రదేశంలో కానీ అన్ని సౌకర్యాలు కల్పించాలని నిత్యం ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు ఇచ్చేవాడని అలాంటి మంచి మనిషి లేడు అనే విషయం జీర్ణించుకోలేక పోతున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ ప్రజలందరికీ అందుబాటులో ఉండాలి



ప్రజాపక్షం/వేములపల్లి: మండలంలోని జివికె, యంఆర్ఐజిహెచ్ ఎస్,లను రాష్ట్ర ఆడిట్ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు.అంబులెన్స్ లోని అత్యవసర సేవలైన ఆక్సో మీటర్ మానిటర్ ఆక్సిజన్ మెడిసిన్ లతో పాటు సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆడిటర్ ఫకీర్ దాసు మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర సేవలు అందించాలనే ఉద్దేశంతో మండలానికి ఒక అంబులెన్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు అంబులెన్స్ సేవలను వినియోగించుకొని ప్రాణనష్టాలు జరగకుండా చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సలీం ఈఎంఈ ఎల్లావుల మధు,తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారికి అన్నప్రాసన

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; మండల కేంద్రంలోని నాలుగవ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసిడిఎస్ సిడిపివో ఖతిజ చిన్నారి ఖదీర్‌కు అన్నప్రాసన చేశారు. అనంతరం సిడిపివో మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి ఆరు నెలల వరకు పిల్లలకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని గర్భిణీ, బాలింతలకు సూచించారు. ఏడవ నెల నుండి అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చేటటువంటి బాలామృతంను జావ లాగా చేసి చిన్నారులకు ఆహారంగా ఇవ్వాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే గుడ్లు, పాలు, బాలామృతం, మధ్యాహ్న భోజనం, ఎగ్ బిర్యానిలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల, టీచర్ బూడిద జ్యోతి, ఆయా హసిన, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామంలో లోపించిన పారిశుధ్యం



ప్రజాపక్షం/వేములపల్లి: మండలంలోని బుగ్గ బాయ్ గూడెం గ్రామం పారిశుద్ధం లోపించి ఎక్కడ చూసినా చెరువులు, కాలువల్లాగా బజార్లు దర్శనమిస్తున్నాయి ప్రజాప్రతినిధుల పోటీ తత్వమే కారణమని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని వీధుల్లో మురుగునీరు నిలిచి పోయిందనే విషయాన్ని గ్రామస్తులు అధికారులకు తెలపడంతో స్పందించిన మండల అభివృద్ధి అధికారి జితేందర్ రెడ్డి, తాసిల్దార్ హేమలత గురువారం గ్రామంలో పర్యటించి పారిశుద్ధం లోపించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో రాజకీయ నాయకుల సమర్థత వల్ల గ్రామంలో అపరిశుభ్రత వాతావరణం నెలకొన్నట్లు గమనించారు , డ్రైనేజీ కాలవలను పునరుద్ధరించి మురుగునీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లలిత సెక్రెటరీ సబితా ఆర్ఐ స్పందన మాజీ సర్పంచ్ నాగలక్ష్మి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలి



ప్రజాపక్షం/తుర్కపల్లి : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తుర్కపల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆరు ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలు ఉన్నాయని, పాఠశాలలు మండల కేంద్రానికి నాలుగు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, విద్యార్థులు మండల కేంద్రం నుండి పాఠశాలకు 4, 5 కిలోమీటర్లు కొందరు, కాలినడకన, ఆటోలలో, ప్రైవేటు వాహనాలు వెళ్తున్నారని, పాఠశాలకు సమయానికి వెళ్ళలేక విద్యార్థులు చాలా ఇబ్బందిగా గురవుతున్నారని అన్నారు. గతంలో బొమ్మలరామారం మండలంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు బస్సు లేక ప్రైవేటు వాహనాలో ప్రయాణం చేస్తున్న ఇద్దరు విద్యార్థులను హాజీపూర్ ఘటనలో అత్యాచారానికి గురయ్యారని, కావున ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ధరావత్ జగన్, నాయకులు మోహన్, నితిన్, రాజశేఖర్, రాజేందర్ పాల్గొన్నారు.

# బంద్ ఫర్ జస్టిస్‘ జయప్రదం చేయండి

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండల కేంద్రంలో స్వర్ణకారుల భవనంలో బీసీ సంఘం జిల్లా నాయకులు సాయిని యాదగిరి అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష పార్టీలు, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశం. ఈ సమావేశం అధ్యక్షులు సాయిని యాదగిరి మాట్లాడుతూ బంద్ ఫర్ జస్టిస్ ‘ అనే పిలుపుతో రేపు 18న జరగబోయే బంద్‌ను వ్యాపార వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు సమస్త ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పిలుపులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి సరిగంజి వీరస్వామి, సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, బిఎస్పి మండల అధ్యక్షులు సుక్క శ్రీకాంత్, ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దుబ్బ దానయ్య, ఏఐవై ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, సిపిఐ నాయకులు బోడిగె సుదర్శన్, సుద్దాల సాయికుమార్, మేర సంఘం అధ్యక్షులు సోమేష్, బిఎస్పి చేకూరి అజయ్, జువ్వ గోని శంకరయ్య, మస్కు నరసింహ తదితరులు పాల్గొన్నారు.





## ధాన్యం దళారులకు విక్రయించొద్దు

ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం): మండలంలోని పల్లె గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్ నిర్వహించి, ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలించారు. అనంతరం మండలంలోని లింగరాజుపల్లి, కూరెళ్ళ గ్రామాలలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, తహసిల్దార్ లావణ్య, డాక్టర్ వంశీకృష్ణ, సిడిపిఓ జ్యోష్న, మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల, డైరెక్టర్లు వినోద, నరసింహ పాల్గొన్నారు.

## వధూవరులకు ఆశీర్వాదం



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; మండల పరిధిలోని దర్గా తండాకు చెందిన రమావత్ బాల్‌సింగ్ కుమారుడు రమావత్ వినయ్‌కుమార్ వివాహం ఆంగోతు సౌజన్యతో జరిగింది. గురువారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ తండాకు వెళ్ళి ఆ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్యగౌడ్, కొర్రరాంసింగ్, ఏడ్నూల గోవింద్, తిరందాస్ రవికుమార్, అరుణజ్యోతి, బాలోజి, ఆంగోతు సుజాత చందర్‌లాల్, వినోద్, గుర్రపు తండా మాజీ ఉప సర్పంచ్ విజయ్, జేమ్లానాయక్, రమావత్ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల హక్కులను కాలరాయడమే

ప్రజాపక్షం/వలిగొండ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకై హైకోర్టులో స్టే విధించగా రాష్ట్ర ప్రభుత్వం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో లీవ్ పిటిషన్ వేయగా సుప్రీంకోర్టు ధర్మాసనం లీవ్ పిటిషన్ కొట్టివేయడం బీసీల హక్కులను కాలరాయడమేనని సీనియర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈతాప రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు దేశ జనాభాలో ఎంత శాతం వారికి అంత శాతం హక్కులు రావాల్సి ఉందని, బిజెపి ప్రభుత్వం కావాలనే ద్వంద నీతితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కాకుండా కుట్రలు పన్నుతుందని ఆయన విమర్శించారు. బీసీల రిజర్వేషన్ అమలు పై స్టే విధించడం బీసీల మనోభావాలను దెబ్బతీయటమేనని ఆయన విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్ అమలుకై పార్లమెంట్ లో చట్టం తీసుకువచ్చి శాశ్వతంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ట్రేసా జిల్లా కోశాధికారిగా జానయ్య



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దాసరి జానయ్యను ట్రేసా (tresa) రెవెన్యూ ఉద్యోగుల అనుబంధ సంఘం జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సందర్భంగా జానయ్యకు పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. నీ భద్రత సేవాభావంతో సంఘ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. తన ఎన్నికకు సహకరించిన రెవెన్యూ ఉద్యోగ సంఘ నాయకులకు ట్రేసా సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.




## డిపిఆర్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణంలోని డిపిఆర్ పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన పాఠశాల యాజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేసి, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట గురువారం బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని చితకబాధిన డిపిఆర్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థిని చితకబాధడం బాధాకరం అని ఆయన అన్నారు. తక్షణమే డిపిఆర్ పాఠశాల గుర్తింపును రద్దు చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని లేని పక్షంలో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు పాత్లావత్ లక్ష్మ ణ్, మధు, జమీర్, జగన్, రాఖీ, వెంకటేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఇంటర్ మీడియట్ ఎంపిసి ద్వితియ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న అల్లె అనుష్క జిల్లా స్థాయి కబడ్డీ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగింది. అందులో భాగంగా 69వ స్కూల్ గెమ్స్ ఈనెల 10 నుండి 12వ తేది వరకు మహబూబాబాద్‌జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొని ప్రశంస పత్రం అందుకోవ డం జరిగింది. అదేవిధంగా ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న కొర్న సాత్విక్, పి. మాళవికలు జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అండర్ 19 పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు మహేష్ లను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రాము అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒడిబియ్యం కార్యక్రమం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పట్టణంలోని బాలాజీ నగర్‌లో శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారికి త్రిశక్తి వనిత గ్రూప్ సూర్యాపేట వారి ఆధ్వర్యంలో దేవాలయ వ్యవస్థాపకులు, ట్రస్ట్ సభ్యులు, సుమారు 200 మంది ముత్తైదువులతో గురువారం అంగరంగ వైభవంగా ఒడి బియ్యం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దేవాలయానికి త్రిశక్తి వనిత గ్రూప్ సహకారంతో 22 కుర్చీలను బహుమతిగా అందజేశారు. గ్రూప్ అధ్యక్షురాలు పసుపర్తి జ్యోతి కృష్ణమూర్తి ఒడి బియ్యం కార్యక్రమంలో పా ల్గొన్న, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



## పర్యావరణహిత వస్తువుల ప్రదర్శన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా,నేషనల్ గ్రీన్ కోర్ కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణహిత వస్తువుల ప్రదర్శన, విక్రయాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా నాగార్జున ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, పట్టణంలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు స్టాల్స్ ను ఏర్పాటు చేసి పర్యావరణహిత వస్తువులను ప్రదర్శించడంతోపాటు విక్రయించారు.చేతి అల్లికలతో తయారు చేసిన బ్యాగులు, పర్యావరణ అనుకూల వస్తువులు , ఆర్గానిక్ ఆహార పదార్థాలు, బొంగుతో తయారైన ప్లేట్లు,బఫట్ ప్లేట్స్,స్వదేశీ దీపావళి వస్తువులు,చేనే త వస్త్రలు,సేంద్రియ కూరగాయలు, తృణ ధాన్యాలతో తయారైన మిల్లెట్స్,సీడ్ పెన్,వెదురుబొంగు బాటిల్స్, ప్రదర్శించడంతో పాటు విక్రయించడం జరిగింది.ఈ క్యాంపస్ లో ఎకో బజారు కూ అద్భుతమైన స్పందన వచ్చింది. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ పర్యావరణవేత్త సురేష్ గుప్తా పాల్గొని ప్రతిభ కనబరిచిన స్టాల్స్ కు ప్రథమ ,ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ కన్వీనర్ వైద్య శిరీష ,సభ్యులు కంబాలపల్లి శివరాణి, డాక్టర్ పి.సిద్దేశ్ గౌడ్ ,డాక్టర్ డి.కృష్ణ ,బోధన,బోధనేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం



**ప్రజాపక్షం/మునుగోడు:** రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని ఉమ్మడి నలగొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిపిసి సెంటర్ పులిపల్పుల, కల్వలపల్లి గ్రామాలలో వద్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలలో దాన్యం అమ్ముకోవాలని దళారులకు అమ్ముకొని మోసపోవద్దు అని అన్నారు. ప్రభుత్వమిచ్చే మద్దతు ధర గ్రేడ్ఏ 2389 రూపాయలు సాధారణ 2369 రూపాయలు సన్న వరి ధాన్యానికి 500 రూపాలు బోనస్ అందిస్తుందని ఇట్టి అవకాశాన్ని రైతులు వినియెగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చేర్మెన్ దోటి నారాయణ,ఎంపిడిఓ యుగేందర్, మానిటరింగ్ అఫిసర్ రేణుక,సంఘ డైరెక్టర్లు సింగం వెంకన్న, నన్నూరి శేఖర్ రెడ్డి,కార్యదర్శి సుఖేందర్,అశోక్ రెడ్డి, పురుషోత్తం, స్వామినాథ్ లింగస్వామి, చంద్రశేఖర్ ప్రజా ప్రతినిధులు భీమనపల్లి సైదులు, తాటికొండ సైదులు, పుట్ట శ్రీనివాస్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇరిగేషన్ పనుల కోసం భూమి సర్వే



**ప్రజాపక్షం/మోతె :** మండల పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభం చేయడానికి అధికారుల బృందం భూమి సర్వే చేస్తున్నట్లు కోదాడ ఆర్‌డిఓ మాధవరావు తెలిపారు. స్థలం పరిశీలన చేసి వివరాలు సేకరించారు. ఇటీవల రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మొదలు పెట్టడానికి భూమి సేకరించి పనులు వేగవంతం చేసే లక్ష్యంతో మండల రెవెన్యూ సిబ్బంది ఇరిగేషన్ అధికారులతో స్థలం పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఎం వెంకన్న, ఆర్ఐ కరుణాకర్ రెడ్డి, సర్వేయర్, లిఫ్టు ఇరిగేషన్ అధికారుల బృందం పాల్గొన్నారు.

## రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/మాడుగులపల్లి:** బిసి రిజర్వేషన్ ఆధ్వర్యంలో 18న జరగబోయే తెలంగాణ రాష్ట్ర బంద్ కు అన్ని విద్యా సంస్థలు సహకరించాలి. బిసి రిజర్వేషన్ల సాధన కోసం బిసి జెఏసి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 18న జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్ లో పార్టీలకతీతంగా సమస్త బీసీ శ్రేణులు పాల్గొని బీసీల ఐక్యతను చాటాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి భూపతి నరేష్ గౌడ్ పిలుపునిచ్చారు.గురువారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ బంద్ ద్వారా బిసిల ఐక్యతను చైతన్యాన్ని చాటి చెప్పాలన్నారు.బీసీలకు న్యాయబద్ధంగా రావలసిన రిజర్వేషన్లను కోర్టులను వేదికలుగా చేసుకొని అగ్రకులాలు అడుగడుగునా అడ్డుకుంటున్నారని,ఇది ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు.కార్యక్రమంలో కొల గుమ్మ స్వామి,పందిరి రాజశేఖర్, పర్శనబోయిన లక్ష్మణ్,బోల్లేపల్లి రాజు,చిత్తలూరి శంకర్,భూపతి మహేష్,భూపతి విగ్నేష్,కొలఉప్పెందర్,బొడ్డు రామ కృష్ణ,బొడ్డు చంద్రశేఖర్,బంటు సైదులు,బంటు నగేష్,అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.





## నల్లతామర పురుగుపై అవగాహన

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మిరప పంటలో నల్ల తామర పురుగుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ (హెచ్ఆర్ఎస్) కొండమల్లెపల్లి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రాజా గౌడ్, కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) సబ్జెక్ట్ మెంటర్ డాక్టర్ నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో ఫీల్డ్ సందర్శన సమయంలో నల్ల తామర పురుగు వల్ల నష్టం, దాని లక్షణాలు, నివారణ చర్యల గురించి వారు వివరించారు. అనుమానిత మొక్కలపై త్రిప్స్ నష్టం గుర్తించే పద్ధతులను ప్రదర్శించి, జీవసంరక్షణ, సేంద్రీయ, రసాయన నియంత్రణ పద్ధతులను సూచించారు. అనంతరం మిరప పంటలను కూడా పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై అన్ని సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోయోలా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/మోతె :** ధాన్యం కొనుగోలు చేసే ప్రతి కేంద్రంలో అక్రమాలకు చోటు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని భీక్యతండలో ఏర్పాటు చేసిన మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్ధతుగా నిలువాలని ప్రతి క్వింటా మొదటి రకం ధాన్యానికి రూ.2,389, కాగా రెండవ రకం ధాన్యానికి రూ.2,369గా ధరలు నిర్ణయించడం జరిగిందన్నారు. అధిక మొత్తం తూకాలు వేయకుండా రైతులకు నష్టం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెలుగు వీరన్న, మండల నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.

## బంద్‌కు వ్యాపార, విద్యా సంస్థలు సహకరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న బిసి జెఏసి ఇచ్చిన తెలంగాణ బంద్‌కు జిల్లా వ్యాప్తంగా వాణిజ్య వ్యాపార సంస్థలు విద్యాసంస్థలు, హోటళ్ళు సహకరించాలని పలు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. బంద్ విజయవంతం చేయాలని కోరుతూ గురువారం స్థానిక మహావీర్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ జనసమితి నిర్వహించిన రౌండ్ టేండ్ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఈ రౌండ్ టేండ్ సమావేశానికి తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్ అధ్యక్షత వహించగా తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మందాడి డేవిడ్ కుమార్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసంత సత్యనారాయణ పిళ్ళై, మాదిగ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతలపాటి శ్రీరాములు, వివిధ సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని ఉపన్యసించారు.



# 18న బిసి బంద్ విజయవంతం చేయాలి








**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల హక్కును కల్పించి కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్పించాలని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 18న చేపట్టే బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో రామలింగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 65శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించడంలో కేంద్రం ముందుకు రావాలని లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోకతప్పదని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, గోగుల యాదగిరి, మహిళా సమైఖ్య నాయకురాలు, నియోజకవర్గ కార్యదర్శి ఎరబోతు పద్మ, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.శాంతా, మధ్యాహ్న బోజన జిల్లా నాయకురాలు బంటు రాజేశ్వరి, ఎస్‌కె.షమీం, జి.రమేష్, భాస్కర్, పరమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బిసి రిజర్వేషన్ల సాధన కోసం వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన బిసి జెఏసి బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్రబంద్‌కు సిపిఐ పట్టణ కమిటి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్మ బిక్షం భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధన తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలన్నారు. బిసి బిల్లులను ఆమోదించి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో కేంద్రంలో బిజెపిని భూస్థాపితం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ నాయకులు ఎడెల్లి శ్రీకాంత్, దేశగాని హేమలత, ఐతరాజు లింగయ్య, పల్స రాజు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆలేరు :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆలేరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆలేరు ఎమ్మార్వోకి బీసీ 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం దీనిని ఆమోదించాలని ఆలేరు ఎమ్మార్వోకి మెమొరండం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ సందర్భంగా ఈ నెల 18న రాష్ట్ర బందుకు సంపూర్ణంగా సిపిఐ మద్దతునిస్తూ బంద్‌లో పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి గొట్టిపాముల శ్రీనివాసరాజ్, సహాయ కార్యదర్శి బొడ్డు ఆంజనేయులు, జానమ్మ, సామి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమ తరహాలో బిసిఉద్యమాన్ని అన్ని విద్యార్థి, రాజకీయ,కుల సంఘాలను కలుపుకొని ముందుకు వెళ్తామని బిసిఎస్‌ఎఫ్ రాష్ట్ర కోశాధికారీ ప్రవీణ్ యాదవ్ తెలిపారు. గురువారం నల్లగొండలో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న జరిగే తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు.

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఈనెల 18న బీసీ ఐకాస నిర్వహించనున్న రాష్ట్ర బంద్ కు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర బందును విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మునుకుంట్ల గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బందులో పార్టీ శ్రేణులు, యువకులు, విద్యార్థులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్ర బందును విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చకుండా భాజపాపై నేపమునేటేందుకు ప్రయత్నిస్తుందని ఈ సందర్భంగా విమర్శించారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 18న జరిగే బిసి బంద్ కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని డిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ తెలిపారు.గురువారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల 42 శాతం రిజర్వేషన్ కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కత్తుల కోటి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్, పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, కంచర్ల ఆనంద్ రెడ్డి, కెవిఆర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.




## వైద్య సహాయం అందే వరకూ సిపిఆర్ అవసరం

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గుండె పని చేయకుండా ఆగిపోయిన వ్యక్తులకు వైద్య సహాయం అందే వరకు ప్రాణాలు నిలపడానికి సిపిఆర్ (కార్డియోపల్మనరి రీససిటేషన్) అత్యవసరమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులకు, సిబ్బందికి సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె పని చేయకుండా ఆగిపోయి శ్వాస తీసుకోకుండా స్పృహ కోల్పోయిన వ్యక్తులకు మాత్రమే సిపిఆర్ విధానం ఉపయోగించాలని గుండెపోటుకు ఈ విధానము ఉపయోగించరాదని సూచించారు. ఇటీవల గుండె పనిచేయకుండా ఆగిపోవడం లాంటి సంఘటనలు పెరిగిపోతున్నాయని అలాంటి సమయంలో సిపిఆర్‌పై ప్రతి ఒక్కరు కనీస అవగాహన కల్గి ఉండాలని తద్వారా ఎవరైనా ప్రమాదంలో ఉంటే వెంటనే స్పందించి సిపిఆర్ చేస్తే ప్రాణాలు కాపాడిన వారు అవుతారని తెలిపారు. వైద్యులు సృజన, శరణ్యలు సిపిఆర్ ఏలా చేయాలో చేసి చూపించారు. అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, డిసిహెచ్ ఎస్ వెంకటేశ్వర్లు, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.





## పరిశుభ్రత, పోషకాహారం ముఖ్యం

**ప్రజాపక్షం/వేములపల్లి:** సంపూర్ణ ఆరోగ్యానికి పరిశుభ్రత, పోషకహారాలు ముఖ్యమని అంగన్వాడి సూపర్వైజర్ పరిమి రజిని అన్నారు. గురువారం మండలంలోని అమనగల్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పోషణ మాస ఉత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యానికి అవసరమైన, అనవసరమైన ఆహారాల గురించి స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సోమేశ్వర రావు, ఝాన్సీ,ఉపాధ్యాయులు జయమ్మ,పద్మావతి,అంగన్వాడీ టీచర్స్ అనిత,కాంతమ్మ, ఆశా వర్కర్లు అన్నపూర్ణ, ఆయాలు సంధ్య,గర్భిణులు,బాలింతలు,బాలికలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని సూర్యాపేట డిపిఓ యాదగిరి అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని అడివెంల గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ రోజువారిగా రికార్డులను కార్యదర్శులు అప్డేట్ చేయాలన్నారు. విధులకు కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయన వెంట మండల ఎంపిడిఓ గోపి, పంచాయితీ కార్యదర్శి ఉన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మండలంలోని చిన్న నారాయణపురంకు చెందిన సిగ స్వామి గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా,ఆయన కూతురు పెళ్లి విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు ఆ కుటుంబ సభ్యులకు రూ. 36 వేలు ఆర్థిక సహా యం గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారు రాంబాబు, బాశెట్టి శ్రీనివాస్,సిగ యాదయ్య గౌడ్,నడింపెల్లి వెంకన్న,కుందూరు మోహన్ రెడ్డి,బండారు మురళి,టీజీ లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన నరేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** హైదరాబాద్‌లో మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంతకండ్ల జగదీష్ రెడ్డిని మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి వారి నుండి బిలిటెడ్ బర్త్ డే ఆశీస్సులను పొందారు. అదేవిధంగా నరేందర్ రెడ్డికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్న రాజ్,మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రెగ్గటే మల్లికార్జున్ రెడ్డిలు బిలేటెడ్ బర్త్ డే విషెస్ చెపుతూ శాలువాతో సత్కరించారు.



# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## ఏఐసిసి పరిశీలకులు మహేంద్రన్





**ప్రజాపక్షం/వైరా:** వైరాలో అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలోని శబరి గార్డెన్స్‌లో ఏఐసిసి సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుని ఎన్నిక పార్టీ కార్యకర్త అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసిసి అబ్జర్వర్ ఆశావాహుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసిసి అబ్జర్వర్ మహేంద్రన్, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, కాంగ్రేస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నియోజకవర్గ ఇంచార్జి రవళిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసిసి అబ్జర్వర్ మహేంద్రన్, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రేస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధి పిలుపు మేరకు జిల్లా కమిటీ అధ్యక్షుని ఎన్నుకునేందుకు నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశాల్లో పార్టీ కోసం పనిచేసిన వ్యక్తులను జిల్లా అధ్యక్షునిగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపిక విధానాన్ని నిర్ణయించేందుకు గ్రామస్థాయి నుంచి అభ్యర్థిని బలపరచడం జరుగుతుందని, పార్టీ కోసం పనిచేసే వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రేస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, బాలాజి నాయక్, మండల కాంగ్రేస్ నాయకులు శీలం వెంకట నర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, వడ్డే నారాయణ, కాంగ్రేస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు : ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలో ఎర్ర బోయినపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను బుధవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ధర 2389, బి గ్రేడ్ ధర 2369 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొని వెళ్లాలని రైతులను కోరారు. రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1500 కోట్లతో పంటల భీమా పథకాన్ని రైతులకు అమలుపరుస్తున్నట్లు వివరించారు. మహిళలకు అర్హులైన వారందరికీ గృహ జ్యోతి. మహాలక్ష్మి. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ ఆవరణలో త్వరలో ధాన్యం నిల్వ గోడౌన్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో గ్రామానికి డ్రై యంత్రం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ ఆవరణలో మహిళ మత్స్యకారులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, భాగం నీరజాదేవి, డీసీఎంఎస్ అధికారి నాగరాజు, ఎంపీడీవో చంద్రశేఖర్, తాసిల్దార్ పులి సాంబశివుడు, వ్యవసాయ శాఖ అధికారిని రూప, పసుమర్తి చందర్రావు, ఐకెపి ఎపిఎం అశోక రాణి, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలి





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో లక్షల రూపాయలు ప్రజా సొమ్ము అవినీతి జరిగిందని, జరిగిన అవినీతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని, అవినీతికి గురైన ప్రజల డబ్బును అంతా రికవరీ చేయాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. అనంతరం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన ఆందోళనలో భూక్యా వీరభద్రం, సుంకర సుధాకర్ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ ఏర్పడిన ఏడు సంవత్సరాల కాలంలో కోట్ల రూపాయల అవినీతి మున్సిపాలిటీలో జరిగిందని, పై స్థాయి అధికారులు కఠినంగా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలుతుందని వారు ఆరోపించారు. జరిగిన అవినీతిని ప్రజలకు తెలిపే విధంగా బహిర్గతం చేసి అవినీతికి పాల్పడ్డ వారిపై కఠినచర్యలు తీసుకుంటేనే అవినీతి అడ్డుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో గతం నుంచి అనేకసార్లు మున్సిపాలిటీ అవినీతి అక్రమాలపై ఆందోళనలు, పోరాటాలు చేస్తామని గుర్తు చేశారు. ప్రభుత్వం, ఉన్నత స్థాయి అధికారులు వెంటనే స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున అవినీతిపై ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం వైరా మున్సిపాలిటీ కమీషనర్ గురులింగంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం వైరా డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చా మణి, వైరా పట్టణ కమిటీ సభ్యులు హరి వెంకటేశ్వరరావు, పైడిపల్లి సాంబశివరావు, సంక్రాంతి నరసయ్య, గుడిమెట్ల మోహన్‌రావు, కొంగర సుధాకర్, షేక్ నాగుల్‌పాషా, తోట కృష్ణవేణి, కామినేని రవి, శాఖా కార్యదర్శులు సంక్రాంతి పురుషోత్తం రావు, బెజవాడ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



**ప్రజాపక్షం/మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలో రోడ్లు అనేక ప్రాంతాల్లో గుంతలు పడి ప్రమాద కరంగా మారాయని, వెంటనే సంబంధిత అధికారులు గుంతలను మరమ్మత్తు చేయాలని బిజెపి నాయ కులు డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ సెంటర్‌లోని కళామందిర్ రోడ్డు నందు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బిజెపి జిల్లా నాయకులు రామిశెట్టి నాగేశ్వర రావు మాట్లాడుతూ మధిర అభివృద్ధి అంటే గుంతలపడ్డ రోడ్లకు మరమ్మత్తులు నిర్వహించటం కాదా అని ప్రశ్నించారు. ఆర్అండ్ బి అధికారులు కమీషన్లు వచ్చే పనులపై మాత్రమే కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, వెంటనే రోడ్లపై ఉన్న గుంతలకు మరమ్మత్తు పనులు నిర్వహించి పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆర్ అండ్‌బి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి టౌన్ అధ్యక్షులు శివరాజు సుమంత్, జిల్లానాయకులు కుంచం కృష్ణా రావు, చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, చిట్యాల శేషుకుమార్, పగడాల నాగేంద్ర బాబు, బియ్యవరపు రామకృష్ణ, మాదిరాజు సాయిరామ్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చావా శివరామకృష్ణ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ జన్మదిన వేడుకలు తన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు తిరుమలాయపాలెం మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. శివరామకృష్ణ అత్యంత ముఖ్యమైన పనిమీద హైద్రాబాద్‌కు వెళ్లగా వేడుకల్లో శివరామకృష్ణ తండ్రి చిన్న చావా వెంకటేశ్వరరావు వేడుకలకు హాజరయ్యారు. తమ అభిమానులు ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అభిమానులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని, మంచితనాన్ని కొనియాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దీవెనలతో ఇటీవల పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారని, రాబోయే రోజుల్లో తిరుమలాయపాలెం మండలంలో పాటు పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ మండలాల్లో ఎక్కువ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేందుకు ఆయన కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బోడా మంగీలాల్, మద్దెలపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ బెల్లం రాము, మండల కాంగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయిల్, ఉన్నం రాజశేఖర్, బత్తుల రవికుమార్, తాటికొండ కిరణ్, గుగ్గిళ్ళ అంబేద్కర్, పొట్ల కిరణ్, పత్తి నాగేవ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డిస్పెన్సరీలో గైనకాలజిస్ట్‌ను నియమించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ లో గల సింగరేణి డిస్పెన్సరీని అన్ని వసతులతో ఆధునికరించి, గైనకాలజిస్ట్ డాక్టర్ ని నియమించాలని ఐ.ఎన్.టి.యూ.సి బ్రాంచ్ సెక్రెటరీ తీగల క్రాంతి కుమార్. గురువారం సింగరేణి డిస్పెన్సనరీ సందర్శించి డాక్టర్ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి దేవదాస్, ఐఎన్టీయూసీ బ్రాంచ్ జాయింట్ సెక్రెటరీ నాగ ప్రకాష్, రామారావు (ఫిట్ సెక్రెటరీ , జె.వి.ఆర్ ఓసి ), బాలాజీ (ఫిట్ సెక్రటరీ, కిష్టారం ఓసి), నాగేశ్వరరావు (ఫిట్ సెక్రటరీ, జే.వి.ఆర్ సి.హెచ్.పి) అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి, సురేష్, నాయకులు రషీద్, రఫీ, దావుద్, సదానందం, పొట్టి కిరణ్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, రాజేందర్, సదానందం, మురళి, హాఫీజ్, కట్ట కృష్ణ, రవి కాంత్, రామంచి రాజయ్య, కే.రవి ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్‌పై సమీక్ష



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం డివిజన్ పరిధిలో సీతారామ ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ నిర్వహణ నీటి సరఫరా పై మరియు మ్యాప్ నిర్వహణ పరిశీలిస్తూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న ఎదుర్కొనేందుకు రైతులతో సమన్వయంగా రైతులకు అవగాహన కల్పిస్తూ అంశాలపై పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ శ్రీనివాసరెడ్డి, ఆరు మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని నిరసన



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం ఏరుగట్ల గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇవ్వాలని కొందరు గ్రామస్తులు గురువారం రోడెక్కి ఆందోళనకు దిగారు. పరిస్థితి తెలుసుకుని తహశీల్దార్ శ్రీనివాస్ విఎం బంజర్ ఎస్ఐ వెంకటేష్ ఏరుగట్ల గ్రామంలో ఆందోళన చేస్తున్న వారికి పరిస్థితి వివరించారు. లబ్దిదారుల ఎంపిక చేసేందుకు ఈ ఏడాది జులై లో గ్రామ సభ నిర్వహించి 40 మంది లబ్దిదారులను ఎంపిక చేసి జిల్లా కలెక్టర్ కు పంపారు. తమకు అన్యాయం జరిగిందని గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి వెళ్లేందుకు గ్రామస్థులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అందరికి ఇండ్లు కేటాయించాల్సిందేనని తహసీల్దార్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఇండ్లు ఎవ్వరికి కేటాయించలేదని స్థలాలు ఇచ్చిన వారి పేర్లను మళ్ళీ పరిశీలించి ఎంక్వయిరీ చేసి జిల్లా కలెక్టర్ కు నివేదిక ఇస్తామని పెనుబల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ నచ్చచెప్పడంతో పరిస్థితి సద్దు సద్దుమణిగింది.

# ఆహార విషయాల పట్ల జాగ్రత్తలు పాటించాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు సెయింట్ మైకేల్ పాఠశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా పాఠశాలలో పలు వంటకాలను ప్రదర్శించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని చిన్ననాటి నుంచి పోషక ఆహారాన్ని తీసుకుంటే రాబోయే తరంలో బలంగా ఉంటారని, విద్యార్థులు చురుకుతనంగా ఉంటారని బలంగా విజ్ఞానంగా, హుషారుగా, ఉల్లాసంగా ఉంటారని ఆయన విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.